క్లుప్తంగా

రన్ ఫర్ జీసస్



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవులు

ఇల్లెందు: రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం ఇల్లెందులో నిర్వహించారు. పట్టణంలోని అన్ని క్రైస్తవ సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం గుడ్ ఫ్రై డే మరుసటి రోజున ఈ కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమంలో సాధనపల్లి క్రాంతి కుమార్, సుజిత్, నాను, ప్రమోద్, టింకూ, వినయ్, బిషప్ యోహాన్, పాస్టర్ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ప్రమోద్‌కుమార్

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వైస్‌ఎంపీపీ ప్రమోద్, ఉపసర్పంచ్ యాకూబీ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సహకారంతో అరెం శ్యామలకు రూ.24వేలు, వాసం సందీప్‌కు రూ.34వేలు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయ్యాయని చెప్పారు. గాజీ, మహేష్, శ్యామ్, రాములు, కోటేష్, నరపాక యాకయ్య, శంకర్, శ్రీను, మల్లేష్ పాల్గొన్నారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆ చర్యలను అడ్డుకుంటామని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సింగరేణి గనులకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. సింగరేణి ప్రైవేటీకరణపై కపట ప్రేమతో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు జాతీయ రహదారిపై ధర్నా చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి మల్లికార్జున్, పాల్వంచ పట్టటన అధ్యక్షుడు నూకల రంగారావు, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు సకినాల వెంకటేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు జెలీల్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వర్లు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పాల్వంచరూరల్: క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు అన్నారు. మండలంలోని దంతలబోరు గ్రామంలో శనివారం దంతలబోరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గెలుపును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లపు యాకయ్య, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు రాము, ప్రముఖ షటిల్ క్రీడాకారుడు శ్రీనివాసరావు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: ఓ బాధిత కుటుంబానికి యూత్ సభ్యులు శనివారం ఆర్థిక సాయం అందించారు. టేకులపల్లి మండలం ప్రెగళ్లపాడు పంచాయతీ పడమటి గుంపునకు చెందిన యువకుడు జోగ చిరంజీవి(30) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు ప్రెగళ్లపాడు యూత్ ఆధ్వర్యంలో మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కొండబత్తుల శ్యామ్, కోరం శ్రీకాంత్, లక్కినేని రంగా, జార మల్లేష్, లింగమల్లు, దన్ను కొత్త చిట్టిరాజు, ముప్పిడి వెంకట్, సుదీప్, దిలీప్ పాల్గొన్నారు.

దాతృత్వానికి ప్రతీక రంజాన్

- 'రోజా' విధిగా ఆచరిస్తున్న ముస్లింలు
- అల్లా ఆశీస్సులు ఉంటాయని నమ్మకం
- ఆధ్యాత్మికత, ఆత్మసంతృప్తి

సండే స్పెషల్



నమాజ్ చేస్తున్న ముస్లింలు



ఇల్లెందురూరల్: మనిషిలో క్రమశిక్షణ, ఐక్యత, సర్వమానవ సౌభ్రాతృత్వం, సహనశీలం, భక్తి పారాయణత్వం, మనోనిశ్చలత, దానగుణాన్ని పెంపొందించే మహత్తరమైన నెల రంజాన్. ఈ మాసంలో చేసే ప్రతి పని వెనుక ఓ పరమార్థం దాగి ఉంటుంది. మనిషిలో ఆధ్యాత్మికతను తట్టి లేపడంతోపాటు వారిలో ఆరోగ్యభాగ్యాన్ని, ఆత్మసంతృప్తిని నింపేందుకు కూడా రంజాన్‌లోని నియమాలు దోహదం చేస్తాయి. అలాంటి నియమాల్లో దాతృత్వం ముఖ్యమైంది. ఇస్లాంలో దయకు, దాతృత్వానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా రంజాన్ మాసంలో దానధర్మాలు చేసే వారికి, స్వీకరించే వారికి మంచి ప్రతిఫలం లభిస్తుందని ముస్లింల నమ్మకం. ఎవరైతే రంజాన్ మాసంలో దయతో ఉంటూ దానధర్మాలు చేస్తారో వారికి ఆ అల్లా ఆశీస్సులు ఉంటాయని.. ఉన్న దాంట్లో ఇతరులకు పంచేవారికి అల్లా తన దీవెనలు అందిస్తారని... వారు మరింత ఉన్నతంగా జీవించేలా ఆశీర్వదిస్తారని.. ముస్లిం మత పెద్దలు చెబుతుంటారు. రంజాన్‌మాసంలో ముస్లింలు చేసే దాన ధర్మాల్లో ముఖ్యమైనవి.. వాటి ప్రాముఖ్యత..

జకాత్...

ఇస్లాం ఐదు స్తంభాల్లో ఒకటిగా జకాత్‌ను పరిగణిస్తారు. జకాత్ అంటే దాతృత్వం. ముస్లింలు తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు విరాళంగా ఇవ్వాలని ఇస్లాం చెబుతోంది. ఇలా చేయడాన్ని ముస్లింలు గొప్ప ఆరాధనగా భావిస్తారు. జకాత్‌ను సంవత్సరంలో ఏ రోజైనా ఇవ్వొచ్చు. అయితే.. రంజాన్ మాసానికి మించిన సమయం మరొకటి ఉండదని వారి నమ్మకం. ఈ సమయంలో చేసే ధార్మిక కార్యాలకు ప్రతిఫలం రెట్టింపుగా ఉంటుందని ముస్లింలు విశ్వసిస్తారు.

ఇఫ్తార్ విరాళం...

రంజాన్ మాసంలో ఉపవాసం పాటించే వారికి సాయంత్రం సమయంలో అందించే విందును ఇఫ్తార్ విరాళంగా పరిగణిస్తారు. సన్నిహితులకు, నిరుపేదలకు ఇఫ్తార్‌గా విరాళం చేస్తే అల్లా ఆశీస్సులు ఉంటాయని ముస్లింలు నమ్ముతారు. ఉపవాసం విరమించే వ్యక్తికి ఆహారం అందించే వారు, ఉపవాసం ఉన్న వ్యక్తి పొందే ప్రతిఫలంతో సమానమైన ప్రతిఫలం పొందుతాడని మహమ్మద్ ప్రవక్త మాటగా ముస్లింలు విశ్వసిస్తారు.

జకాత్ అల్–ఫితర్...

రంజాన్ పవిత్రదినం రోజున చేసే దాతృత్వాన్ని జకాత్ అల్–ఫితర్‌గా పరిగణిస్తారు. ఇది నిరుపేదలకు అందించే విరాళం. జకాత్ అల్–ఫితర్ రంజాన్, ఈద్ ఉల్ ఫితర్ రోజున అందిస్తారు. పండుగ రోజున ఉన్నవారు, లేనివారు అందరూ ఒకే విధంగా పండుగను జరుపుకోవడమే జకాత్ అల్–ఫితర్ ప్రధాన ఉద్దేశ్యం. జకాత్ అల్–ఫితర్‌ను ఎవరైనా ఇవ్వడానికి ప్రయత్నించినప్పుడు ఎట్టి పరిస్థితిలోనూ వద్దు అనకూడదని ఇస్లాం చెబుతోంది.

దుస్తుల విరాళం...

మనకు ఉన్నదాంట్లో ఎంతో కొంత సమాజానికి తిరిగి ఇవ్వడమే దానం, దాతృత్వం. రంజాన్ రోజు ఉన్నవారు కొత్త బట్టలు ధరిస్తే లేనివారు పాత దుస్తులు, చిరిగిపోయినవి ధరిస్తారు. సంపద ఉన్న వారు ఒకలా, లేనివారు మరోలా పండుగను జరుపుకుంటారు. రంజాన్ పవిత్ర పర్వదినాన్ని అందరూ సమానంగా జరుపుకోవాలని ఆశిస్తూ దానం చేయడం కూడా మంచి ప్రతిఫలాన్ని అందిస్తుందని ఇస్లాం చెబుతోంది.

సదఖా... దాతృత్వం ఎప్పుడూ భౌతికంగా, డబ్బు రూపంలోనే ఉండాల్సిన అవసరం లేదు. ఎవరికైనా చేసే మాట సాయం కూడా దానం కింద పరిగణించబడుతుంది. మనస్ఫూర్తిగా, నిజాయితీగా, ఎదుటి వారు సంతోషంగా ఉండాలని చేసే ప్రతి చర్య కూడా దాతృత్వం కింద పరిగణించబడుతుందని ఇస్లాం చెబుతోంది. ఆహారం, బట్టలు, డబ్బు దానం చేయలేని పరిస్థితిలో ఉన్నవారు మాట సాయం, చిరునవ్వుతో పలకరింపు, ఎదుటివారి ఆనందాన్ని కోరుకోవడం కూడా దాతృత్వం కిందే పరిగణించబడుతుందని గుర్తించాలి.

పేదలకు సాయం చేస్తాం..



ఆకలి అంటే ఎంత కఠినంగా ఉంటుందో స్వయంగా అనుభవిస్తే తప్ప తెలియదు. ఆ బాధ ఎవరికీ ఉండకూడదని ఇస్లాం చెబుతోంది. అందుకే ఏడాదిపాటు సంపాదించిన సొమ్ములో కొంతైనా పేదలకు అందజేస్తాం. ఉపవాస దీక్షలు, నమాజ్ కంటే మిన్నగా దాతృత్వంతోనే ఆత్మసంతృప్తి కలుగుతుంది.

– ఎండీ జనీముద్దీన్, ఇల్లెందు

సాయం చేయడమూ ఆరాధనే..



మనకు ఆకలి వేస్తే భరించడం ఎంత కష్టమో 'రోజా'ఉపవాసం తెలియజేసి సాటి నిరుపేదలకు దానధర్మాలు చేయమని పవిత్ర ఖురాన్ సూచిస్తోంది. ఇతరులకు సాయం చేయడమూ దైవ ఆరాధనగానే భావిస్తాం. రంజాన్ మాసంతోపాటు ఏడాది పొడవునా తోచిన సాయం చేయడం మా విధి.

– ఎండీ అయ్యూబ్, ఇల్లెందు

పొంగులేటి ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి



పొంగులేటి అభిమానులతో సమావేశమైన గోపాలరావు తదితరులు

చుంచుపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేస్తున్న ఆత్మీయ సమ్మేళనానికి అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు ఊకంటి గోపాల్‌రావు, తూము చౌదరి పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్, పెనగడప, రుద్రంపూర్, చుంచుపల్లి తండా తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక నాయకులను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో జరిగే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి పెద్ద ఎత్తున పొంగులేటి అభిమానులు రావాలని, అక్కడే భోజన సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. కార్యాక్రమంలో పిచ్చిరెడ్డి, గౌస్‌భాయ్, పూనెం శ్రీనివాస్, నమిళ్ల నరేష్, గోరె బాబు, రావూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

ఇల్లెందు: తెలంగాణలోని నిరుద్యోగులు, విద్యార్థులకు వైఎస్‌ఆర్‌టీపీ తెలంగాణ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ పిట్టా రాంరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ బానోతు సుజాత హామీ ఇచ్చారు. శనివారం ఇల్లెందులోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరుద్యోగ యువతీ యువకులకు అండగా 'టీ సేవ్–రిలే దీక్ష'చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైఎస్ షర్మిల జెండాలకు అజెండాలకు అతీతంగా టీ సేవ్ కార్యక్రమం చేపట్టిందన్నారు. వ్యయప్రయాసాలకు ఓర్చి వేల రూపాయలు వెచ్చించి పరీక్షలకు సిద్ధమైన నిరుద్యోగులకు అశనిపాతంలా టీఎస్‌పీఎస్‌సీ పేపర్లు లీక్ చేశారని తెలిపారు. టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలని కోరారు. లీకేజీ సంఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిలతో విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌టీపీ నాయకులు మంగీలాల్ నాయక్, బాలాజీ నాయక్, సత్తిరెడ్డి, నగారపు రాములు, అశోక్, రాము, మేకల రాజేష్, వీరా, రాజు తదితరులు పాల్గొన్నారు.

మోసపోయిన విద్యార్థులు, నిరుద్యోగులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

జూలూరుపాడు: తెలంగాణ విద్యార్థులు, యువతను ప్రధాని నరేంద్ర మోదీ మోసం చేశారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటించే హక్కు లేదంటూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోదీ గో బ్యాక్.. అంటూ శనివారం జూలూరుపాడులో దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి రావాల్సిన విద్యా సంస్థలు ఇవ్వలేదని, రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులను మోసం చేశారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ టెన్త్ పేపర్ లీకేజీకి పాల్పడి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న అంశంపై ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం విచారకరమన్నారు. బోడా అభిమిత్ర, జెమ్మి యశ్వంత్, అనిల్, పవన్, రిషి, మనోజ్, జగన్, సాగర్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి



మాట్లాడుతున్న నజీర్

టేకులపల్లి: ప్రధాన మంత్రి మోదీ తెలంగాణ పర్యటనకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం కోయగూడెం ఓపెన్ కాస్టులో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి ఎండీ.నజీర్ అహ్మద్ మాట్లాడుతూ... తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటనను వ్యతిరేకిస్తున్నామన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చారని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదో వేజ్ బోర్డు కాలపరిమితి ముగిసి 21 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వేజ్ బోర్డు సమస్యను పరిష్కరించలేదన్నారు. వెంటనే 11వ వేజ్ బోర్డును అమలు చేయాలని కోరారు. విదేశాలలో అదానీకి చెందిన బొగ్గు గనుల నుంచి 10 శాతం దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ ఆంక్షలను తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ కృష్ణ, కొంగర వెంకటేశ్వర్లు, వెంకట నర్సయ్య, భూక్యా నాగేశ్వరరావు, జోగారావు, కిషోర్, బాలాజీ, షబ్బీర్, కనకరాజు, పవన్, దేశపతి శ్రీనివాస్, సర్వర్, రామస్వామి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూలే జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

పాల్వంచ: బహుజనుల అభివృద్ధికి సంఘ సంస్కర్త పూలే చేసిన కృషి అమోఘమైందని బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బరగడి దేవదానం అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదానం మాట్లాడుతూ.. ఈనెల 14న పూలే 116వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని, దమ్మపేట సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు జరిగే ర్యాలీ, అమర వీరుల స్తూపం వద్ద ముగింపు సమావేశం ఉంటుందని, బహుజనులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీపాద సత్యనారాయణ, షేక్ నబీసాహెబ్, ముసలయ్య, రామచందర్‌రావు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రచారంపై ఫిర్యాదు

జూలూరుపాడు: సోషల్ మీడియా వేదికగా పార్టీ మారినట్లు అసత్య ప్రచారం చేస్తూ తన ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాళోత్ మంగీలాల్ జూలూరుపాడు సీఐ జె.వసంతకుమార్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం జూలూరుపాడులో మంగీలాల్ మాట్లాడుతూ.. తనపై రాజకీయంగా ఎదుర్కోలేక ఇలా దుష్ప్రచారం చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేయనున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

వీధి కుక్కలకు స్టెరిలైజేషన్



కుక్కలను పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

పాల్వంచ: పట్టణంలో భారీ సంఖ్యలో వీధి కుక్కల సంతతి పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనేక ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా బొల్లేరుగూడెం, టీచర్స్ కాలనీ, ఒడ్డుగూడెం ఏరియాల్లో కుక్కలను పట్టుకుంటున్నారు. వాటిని కొత్తగూడెంలోని డాగ్ కేర్ సెంటర్‌కు తరలించి స్టెరిలైజేషన్ చేసి వదిలిపెడుతున్నారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: దాడిచేసిన భార్యాభర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ధర్మసోత్ లలిత ఇంటి వద్ద ఈనెల 5వ తేదీన ప్రహరీ నిర్మాణం చేస్తుండగా ధర్మసోత్ సీతారాం ఆయన భార్య అరుణ వచ్చి తీవ్రంగా దూషించడమే కాకుండా దాడికి పాల్పడ్డారని బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భార్యభర్తలు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

సింగరేణి ప్రైవేటీకరణపై కార్మికుల నిరసన



కొత్తగూడెం బయలుదేరిన టీబీజీకేఎస్ నేతలు

ఇల్లెందు: సింగరేణిలో పలు మైన్లను ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నాలను నిరసిస్తూ టీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ పిలుపు మేరకు కొత్తగూడెంలో శనివారం జరిగిన మహాధర్నాకు ఇల్లెందు ఏరియా నుంచి కార్మికులు భారీగా తరలివెళ్లారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ మాట్లాడుతూ.. కార్మికవర్గం కేంద్ర బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాల మీద తమ నిరసన గళం విప్పిందన్నారు. బీజేపీ బొగ్గు బావుల బహిరంగ వేలం చర్యలను నిరసించాలని కోరారు. కొత్తగూడెం తరలి వెళ్లిన టీబీజీకేఎస్ నేతల్లో సెంట్రల్ సెక్రెటరీ కళ్లెం కోటిరెడ్డి, బ్రాంచి కార్యదర్శి జే.వెంకటేశ్వర్లు, గౌసమియా, సంజీవరావు, ఎస్‌వీఎస్‌ఎన్ రాజు, బోలా, శంకర్‌రావు, ఆవుల శ్రీనివాస్, అజీజ్, రమేష్‌బాబు, అశోక్, జాఫర్, శ్రీనివాసరెడ్డి, మధు తదితరులు ఉన్నారు. అదే విధంగా బీఆర్‌ఎస్ పిలుపులో భాగంగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన ధర్నాలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే హరిప్రియ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు తరలివెళ్లారు.

రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలి



పాల్వంచ: మాట్లాడుతున్న విశ్వనాథం



జూలూరుపాడులో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పాల్వంచ: రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా తెలంగాణలో మోదీ పర్యటించడం సరికాదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో మోదీ హైదరాబాద్ పర్యటనను నిరసిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ.. బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్ట్‌లకు జాతీయ హోదా, గిరిజన విశ్వవిద్యాలయం వంటి విభజన హామీలను అమలు చేయకుండా తెలంగాణకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయబోమని చెబుతూనే నాలుగు గనులను ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపట్టారన్నారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణ విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడుసుమిల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, పద్మజ, నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, నరహరి నాగేశ్వరరావు, శనగరపు శ్రీనివాస్, జ్యోతుల రమేశ్, రాజు, రాకేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్ర కుమార్ విమర్శించారు. శనివారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో జూలూరుపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మోదీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ విభజన హామీలను తుంగలో తొక్కి తెలంగాణకు అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, చింతా స్వరాజ్‌రావు, గార్లపాటి వీరభద్రం, ఎస్కే చాంద్‌పాషా, యల్లంకి మధు, గుండెపిన్ని మధు, తాతా మధు తదితరులు పాల్గొన్నారు.

వారికి నిబంధనలు వర్తించవా ?



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఎలాంటి ట్రాఫిక్ నిబంధనలు వర్తించవా.. అని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రశ్నించారు. శనివారం కొత్తగూడెంలోని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రి, ఎమ్మెల్సీలు జాతీయ రహదారిని నిర్బంధించి ధర్నా నిర్వహించడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు రహదారిని మూసివేయడంతో ప్రజలు, వాహనదారులు, తీవ్రంగా ఇబ్బందులు పడినట్లు చెప్పారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు ధర్నా చౌక్‌లో పర్మిషన్ అడిగితే సవాలక్ష నిబంధనలు విధిస్తారని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులకు ఏకంగా జాతీయ రహదారి అది కూడా జిల్లా కేంద్రంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం బస్టాండ్ ఏరియాలో సంబంధిత అధికారులు ఎలా పర్మిషన్ ఇచ్చారని ప్రశ్నించారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్నప్పటికీ విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని తెలిసి ఎలా పర్మిషన్‌కు ఒప్పుకున్నారని, రోజంతా ధర్నాకు అనుమతి ఇవ్వడం పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో సాయి, చెనిగరపు నిరంజన్‌కుమార్, నాగుల రవికుమార్, అల్లకొండ శరత్, తాటిపాముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వనమా స్వగృహంలో అతిథులకు విందు



వనమా ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి పువ్వాడ, రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ఎమ్మెల్యేలు

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచలోని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్వగృహంలో శనివారం మధ్యాహ్నం అతిథులు భోజనం చేశారు. సింగరేణి పరిరక్షణకు అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం కొత్తగూడెంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు హాజరయ్యారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, హరిప్రియ, కందాల ఉపేందర్‌రెడ్డి, రాములు నాయక్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌రావు, ఖమ్మం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఖమ్మం మేయర్ నీరజ, డీసీఎంఎస్ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఇల్లెందు చైర్మన్ డి.వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా రాజకీయ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పారిశుద్ధ్యం పాటించండి..!



మున్సిపాలిటీలోని శివనగర్ ప్రధాన రోడ్డులో డ్రెయినేజీ శుభ్రం చేయక నెలలు గడుస్తోంది. దీంతో కాల్వలు మురుగుతో నిండి రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. రోడ్డుపై నడిచే వారు, వాహనదారులు ఈ మురుగు నీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చుట్టుపక్కల వారు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వలు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– పాల్వంచ

ప్రశ్నించాల్సిన అధికారి : సీహెచ్.శ్రీకాంత్,
మున్సిపల్ కమిషనర్
సెల్ నంబర్ : 9849905884